# కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలి

- కరెంటు వద్దన్న హస్తం పార్టీని తిరస్కరించాలి
- కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే 50 ఏండ్లు వెనక్కి..
- ముంపునకు శాశ్వత పరిష్కారం చూపించా
- ప్రజా ఆశీర్వాదమే వేయి ఏనుగుల బలం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నరేందర్
- నన్నపునేనికి మంగళ హారతులతో ఘన స్వాగతం




గిర్మాజీపేట: గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నరేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేనికి మద్దతుగా కదిలిన ప్రజలు



అభివాదం చేస్తున్న బండా ప్రకాశ్, నన్నపునేని

ఖిలావరంగల్, నవంబర్ 16: కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ వద్దన్న హస్తం పార్టీని ప్రజలు తిరస్కరించాలని బీఆర్ఎస్ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో గురువారం కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో నన్నపునేనికి ఎదురేగి బొట్టుపెట్టి ఆశీర్వదించారు. ప్రజలు అడుగడుగునా అపూర్వస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకి ఓటు వేస్తే వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధిలో 50 ఏండ్లు వెనక్కి వెళ్తుందన్నారు. తనకు రాజకీయ జీవితాన్నిచ్చిన శివనగర్ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. తూర్పు నియోజకవర్గ రూపురేఖలు మార్చివేశానని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజా ఆశీర్వాదమే తనకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తున్నదన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు అధికార దాహం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దోనపూరి రమేశ్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు కానుగంటి స్వామి, మేరుగు అశోక్, గడ్డం రవి, శ్రీరాం రాజేశ్‌తోపాటు కార్పొరేటర్లు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

**కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా**

గిర్మాజీపేట: తనపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనా పూర్ణచందర్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్‌కు చెందిన కత్తెరపల్లి వేణుతోపాటు వారి బృందం 30 మంది శివనగర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతామన్నారు.

**సైనికుల్లా పని చేద్దాం..**

కాశీబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేసేందుకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో సైనికుల్లా పని చేద్దామని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. 18వ డివిజన్ లేబర్‌కాలనీలో బుధవారం రాత్రి తాండ్ర భాస్కర్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలు, కల్లబొల్లి మాటలను వెంటనే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, పార్టీ రాష్ట్ర నాయకుడు అచ్చ విద్యాసాగర్, జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కోరబోయిన విజయ్, కార్పొరేటర్ బాబు, మాజీ కార్పొరేటర్ రాజేందర్, తాళ్ల ఉమాదేవి, సీబీ చర్చి ప్రెసిడెంట్ పీఆర్ సల్మాన్, కుమార్ పాల్గొన్నారు.

**నన్నపునేనికి ఆర్యవైశ్యుల మద్దతు**

పోచమ్మమైదాన్: బీఆర్ఎస్ వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం పెద్దలు తెలిపారు. మట్టెవాడ వేణుగోపాలస్వామి ఆలయ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి మూకుమ్మడిగా మద్దతు ప్రకటించారు. ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను బలపరుస్తూ.. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా నరేందర్‌ను గెలిపిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్యవైశ్య సంఘం పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**ఏకగ్రీవంగా నన్నపునేనికి మద్దతు**

గిర్మాజీపేట: బీఆర్ఎస్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్‌కు రోజురోజుకూ మద్దతు పెరుగుతున్నది. గురువారం 26వ డివిజన్‌లోని ప్రింటర్స్ అసోసియేషన్, మార్కండేయ సేవా సంఘం సభ్యులు మూకుమ్మడిగా బీఆర్ఎస్‌లో చేరి నరేందర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం ఆమోద పత్రాన్ని నరేందర్‌కు అందజేశారు. ప్రింటర్స్ అసోసియేషన్ వారికి 100 గజాల స్థలంతోపాటు భవనానికి నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రింటర్స్ అసోసియేషన్, మార్కండేయ సేవా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలిన సురేశ్, ఎన్నికల ఇన్‌చార్జి కూచన రమేశ్, ఎలకంటి సతీశ్, కూచన క్రాంతి, ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల భానుమూర్తి, మార్కండేయ సేవా సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ, వెంగరి ప్రదీప్, కూచన శ్రీకాంత్, కోడెం యుగేంధర్, మాచబత్తుల రాజ్‌కుమార్, పాషికంటి రవీందర్, కృష్ణ, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

**'ఓట్లు అడిగే దమ్ము నాకే ఉంది'**

గిర్మాజీపేట: 'తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి పట్టం కట్టండి.. చేసిన అభివృద్ధి చెప్పుకొని ఓట్లు అడిగే దమ్ము నాకే ఉంది. నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఓట్లు అడిగే అవకాశమే లేదు' అని ఎమ్మెల్యే అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. గురువారం రాత్రి ఆయన నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తో కలిసి 26వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఆపదొచ్చినప్పుడు కానరాని నాయకులు ఇప్పుడొచ్చి ఓట్లు అడిగితే ప్రజలు తిరస్కరిస్తారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ బాలిన సురేశ్, బీఆర్ఎస్ నేత షమీమ్ మసూద్ పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఎన్నికల వ్యయ వివరాలు అందించాలి

**రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా**

వరంగల్, నవంబర్ 16: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వ్యయ వివరాలను వెంటనే సమర్పించాలని తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చు వివరాల రిజిస్టర్‌ను మూడు పర్యాయాలు ఈ నెల 18, 22, 27 తేదీల్లో బల్దియాలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వ్యక్తిగతంగా గాని, వారి ఏజెంట్ల ద్వారా ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు కేంద్ర వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్‌సింగ్‌కు అందజేయాలని సూచించారు. దీనిపై అభ్యర్థులకు నోటీసులు అందజేశామని తెలిపారు. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన రోజువారీ ఖాతాలను సమర్పించాలని కోరారు. ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించకుంటే శిక్షార్హులని హెచ్చరించారు.

## మట్టెవాడ సంఘంలో చేనేత ఉత్పత్తుల కొనుగోళ్లు

పోచమ్మమైదాన్, నవంబర్ 16: వరంగల్ టెస్కో ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాల్లో ఉన్న ఉత్పత్తుల కొనుగోళ్లను గురువారం ప్రారంభించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని కమలాపూర్, శాయంపేట, కొత్తవాడ, తుమ్మలకుంట సంఘాల్లోని బెడ్‌షీట్లు, కార్పెట్లు, బ్రౌన్ టవళ్లు, పాలిస్టర్ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఏటా టెస్కో తరపున చేస్తున్న కొనుగోళ్లల్లో భాగంగా సంఘాల్లో నిల్వ ఉన్న స్టాక్‌ను బండిల్స్ కట్టి గోదాములకు తరలించనున్నారు.

# బీఆర్ఎస్ ప్రచారానికి నీరా'జనం'

- వాడవాడలా అపూర్వ స్వాగతం
- ప్రజల నుంచి విశేష స్పందన
- ఉత్సాహంగా ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు

ఖిలావరంగల్, నవంబర్ 16: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. వాడవాడలా అపూర్వ స్వాగతం పలుకుతుండడంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా గురువారం బీఆర్ఎస్ వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పలు డివిజన్లలో కార్పొరేటర్లు, ఇన్‌చార్జీలు విస్తృత ప్రచారం నిర్వహించారు. 34వ డివిజన్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పగడాల సతీశ్, యూత్ అధ్యక్షుడు కలకొండ అభినాష్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అలాగే, 37వ డివిజన్ గిరిప్రసాద్‌నగర్‌లో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, కాలనీ అధ్యక్షుడు ఎండీ ఉల్ఫత్ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి నరేందర్‌ను గెలిపించాలని కోరారు. 38వ డివిజన్‌లో కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బోగి సురేశ్, రావుల రాజేశ్, కే ప్రతాప్ పాల్గొన్నారు.

**నన్నపునేనిని మరోమారు ఆశీర్వదించాలి**

గిర్మాజీపేట: నన్నపునేనిని మరోమారు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరాయి. ఈ మేరకు 25, 26, 28, 33 డివిజన్లలో కార్పొరేటర్లు బస్వరాజు శిరీష, బాలిన సురేశ్, గందె కల్పన, బీఆర్ఎస్ నేత ముష్కమల్ల సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత బస్వరాజు శ్రీమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాజీ తుమికి రమేశ్‌బాబు, కొలిపాక శ్రీనాథ్, జన్ను శ్యామ్, నెల్సన్, బండారి రమేశ్, ఎండీ అమీన్, ఎండీ యాకూబ్‌పాషా, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌ను గెలిపించాలి**

కరీమాబాద్/కాశీబుగ్గ: బీఆర్ఎస్‌ను గెలిపించాలని కార్పొరేటర్ పోశాల పద్మ కోరారు. పార్టీ విజయం కోసం గురువారం 41వ డివిజన్‌లో కార్పొరేటర్ పోశాల పద్మ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోశాల పద్మ మాట్లాడుతూ మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తూర్పులో నన్నపునేని నరేందర్‌ను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పోశాల స్వామి, కలకోట్ల రమేశ్, ఈదుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ 19వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి నన్నపునేని నరేందర్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యులు గోరంటల మనోహర్, వేముల నాగరాజు పాల్గొన్నారు. 20వ డివిజన్‌లో జాగృతి నాయకుడు పెండ్యాల సోను ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్, కట్కూరి సాయి, చిమ్మని గోపి పాల్గొన్నారు.

**తూర్పులో 'రామక్క' పాట జోరు..**

పోచమ్మమైదాన్: వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా నన్నపునేని నరేందర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పలు డివిజన్లలో చేస్తున్న ప్రచారంలో భాగంగా 'గులాబీ జెండాలే రామక్క.. గుర్తులను గుర్తుంచుకో రామక్క... కారును గుర్తుంచుకో రామక్క' అనే పాట తూర్పు నియోజకవర్గంలో మార్మోగుతున్నది. ఏ డివిజన్‌కు వెళ్లినా అదే పాటకు మహిళలు స్టెప్పులేస్తూ ఆకట్టుకుంటున్నారు. వాడవాడలా ప్రచారం చేస్తూ సందడి చేస్తున్నారు. 21వ డివిజన్ తిలక్‌రోడ్డులో దుబాసి సమ్మక్క ఆధ్వర్యంలో మహిళలు రామక్క పాటకు నృత్యాలు చేస్తూ అలరించారు. కార్పొరేటర్ ఎండీ ఫుర్ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరప్రతాలు పంపిణీ చేశారు. 22వ డివిజన్‌లో కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, డివిజన్ ఇన్‌చార్జి మావురపు విజయభాస్కర్‌రెడ్డి, 12వ డివిజన్‌లో కార్పొరేటర్ కావటి కవిత, డివిజన్ ఇన్‌చార్జి యెలుగం శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు.



గిరిప్రసాద్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ




కరీమాబాద్: 41వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పోశాల పద్మ, తిలక్‌రోడ్డులో నృత్యం చేస్తున్న మహిళలు